క్లుప్తంగా

21న గురు పూర్ణిమ వేడుకలు



బేతంచెర్ల: పట్టణ సమీపంలోని షిరిడీ సాయి బాబా ఆలయంలో ఈనెల 21వ తేదీ ఆదివారం గురు పూర్ణిమ వేడుకలను నిర్వహిస్తున్నట్లు సాయిభక్త బృందం సభ్యులు తెలిపారు. ఉదయం 5:30 గంటలకు ఓంకార ప్రణవం, కాగడ హారతి, సుప్రభాత సేవ, 6:25 బాబాకు అభిషేకం, విష్ణు సహస్ర పారాయణం, అష్టోత్తర శతనామావళి, మహామంగళహారతి, 8 గంటలకు రూ.5 నాణేలతో బాబా తులభార కార్యక్రమం జరుగుతుందని వెల్లడించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

విద్యార్థి చదువుకు ఆర్థిక సాయం



నగదు అందజేస్తున్న ప్రకృతి పీఠం అధ్యక్షుడు నరసింహారెడ్డి

కోవెలకుంట్ల: పట్టణానికి చెందిన పేద విద్యార్థి త్యాగరాజు దత్త చదువుకు ఆదివారం ప్రకృతి పీఠం ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందించారు. ఎంబీబీఎస్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థికి ఉయ్యాలవాడ మండలం పెద్దయమ్మనూరు గ్రామానికి చెందిన డిప్యూటీ ఇంజినీర్ వెంకటసుబ్బయ్య రూ. 10 వేలు ఇవ్వడంతో ఆ మొత్తాన్ని ప్రకృతి పీఠం అధ్యక్షుడు, రిటైర్డ్ లైబ్రేరియన్ పల్లె నరసింహారెడ్డి విద్యార్థికి అందజేశారు.

సమాజ సేవలోనే ఆత్మ సంతృప్తి



రిటైర్డు ఉపాధ్యాయులను సత్కరిస్తున్న ప్రభుత్వ పెన్షన్‌దారులు

డోన్: ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి అని రాష్ట్ర ప్రభుత్వ పెన్షన్‌దారుల సంఘం కార్యదర్శి భానుసింగ్ అన్నారు. స్థానిక పెన్షనర్ల కార్యాలయంలో ఆదివారం పదవీ విరమణ చేసిన ప్రభుత్వ ఉపాధ్యాయులు లక్ష్మీకాంతరెడ్డి, భూకాంతరెడ్డిలను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా భానుసింగ్ మాట్లాడుతూ.. పదవీ విరమణ పొందిన ప్రభుత్వ ఉద్యోగులు తమ జీవిత చరమాంకంలో కాలాన్ని సమాజ సేవకు ఉపయోగించి ఆత్మ సంతృప్తి పొందాలని, దానికి మించిన సంపద లేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి గాలయ్య, కోశాధికారి గోపాల్, సంఘం నాయకులు సుబ్బరాయుడు, రామదాసురెడ్డి, ఆంజనేయులు, నరసింహులు, రామక్రిష్ణారెడ్డి, జయరాముడు, తిమ్మయ్య పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



ఆర్‌సీఎం చర్చి ఆవరణలో మొక్కలు నాటుతున్న క్రైస్తవులు

కోవెలకుంట్ల: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని రోమన్ కాథలిక్ మిషన్ చర్చి పాస్టర్ లూర్దయ్య అన్నారు. ఆదివారం స్థానిక చర్చి ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. అడవులు అంతరించి పోతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ రెండు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో సిస్టర్ జాన్ మేరి, సంఘ పెద్దలు కొమ్ము సుబ్బరాయుడు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రి రోగులకు పౌష్టికాహారం పంపిణీ



రోగులకు పౌష్టికాహారం అందజేస్తున్న దాతలు

డోన్: పట్టణంలోని వంద పడకల ప్రభుత్వాస్పత్రిలో దాతల సహకారంతో ఆదివారం బాలింతలు, గర్భిణులు, వారి సహాయకులకు రొట్టెలు, గుడ్లు, పప్పును పంపిణీ చేశారు. రాధాక్రిష్ణ స్వీట్స్ షాప్ యజమాని చిదంబరం ఆర్థిక సహాయంతో అందజేసినట్లు ఆదరణ వృద్ధాశ్రమం నిర్వాహకుడు జాన్ ప్రభాకర్ తెలిపారు. దాతలను ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎస్ఎండీ హనీఫ్ అభినందించారు.

నిత్యాన్నదానానికి విరాళం

బనగానపల్లె రూరల్: మండలంలోని టంగుటూరు గ్రామంలో వెలసిన పెద్దమ్మతల్లి నిత్యాన్నదాన సంస్థకు ఇదే గ్రామానికి చెందిన సానబోయిన నాగమ్మ కుమారుడు మురళీకృష్ణ, ఓబుళమ్మ దంపతులు ఆదివారం రూ.30,020 విరాళాన్ని సంస్థ నిర్వాహకుడు రామగంగిరెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ తరఫున దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. దాత కుటుంబ సభ్యులు తరుణ్, వైష్ణవి పాల్గొన్నారు.

హజరత్ అబ్బాస్.. వెయ్యి దివిటీల వెలుగు!

- నేడు మధ్య సరిగెత్తు సందర్భంగా వేడుక
- ఊరేగింపునకు ఏర్పాట్లు
- మొహర్రంలో హజరత్ అబ్బాస్‌కు ప్రత్యేకత
- షియా మతస్తుల ఆధ్వర్యంలో ప్రార్థనలు



కోవెలకుంట్ల: బసిరెడ్డిబావి వీధిలో కొలువుదీరిన హజరత్ అబ్బాస్ పీరు



వెయ్యి దివిటీల వెలుగులో ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు (ఫైల్)



కోవెలకుంట్లలో పీర్లను ఊరేగిస్తున్న భక్తులు



బనగానపల్లె: ఇమాంఖాసీం పీర్లకు ఫతేహాలు సమర్పిస్తున్న భక్తులు

కోవెలకుంట్ల: హిందూ, ముస్లింలు మతసామరస్యానికి ప్రతీకగా జరుపుకునే మొహర్రం వేడుకలకు కోవెలకుంట్ల పట్టణంలోని బసిరెడ్డిబావి వీధిలో కొలువుదీరిన హజరత్ అబ్బాస్ పీరుకు ప్రత్యేకత ఉంది. ఏటా మధ్య సరిగెత్తు రోజున వెయ్యి దివిటీల వెలుగులో స్వామివారి ఊరేగింపు నిర్వహించడం ఆనవాయితీ. ఈ నెల 7వ తేదీ నుంచి మొహర్రం వేడుకలు ప్రారంభం కాగా సోమవారం మధ్యసరిగెత్తును పురస్కరించుకుని ఈ వేడుకలు జరుగనున్నాయి. పీర్ల చావిడిలో హజరత్ అబ్బాస్ పీరుతో పాటు ఇమాం కాశీం పీరును కొలువుంచి భక్తులు ఫతేహాలు సమర్పిస్తున్నారు.

హజరత్ అబ్బాస్ చరిత్ర

ఖర్బలా మైదానంలో యజీద్‌రాజుతో జరిగిన యుద్ధంలో మహమ్మద్ ప్రవక్త మనువడు ఇమాం ఉసేన్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యుడైన హజరత్ అబ్బాస్ మృతి చెందినట్లు పూర్వీకుల కథనం. హజరత్ అబ్బాస్‌ను స్మరించుకుంటూ ఆయన పేరుతో స్థానిక బసిరెడ్డి బావి వీధిలో పీరును ఏర్పాటు చేసి కొన్ని దశాబ్దాల నుంచి కాశీంవలీ వంశస్తులు అహమ్మద్ ఉసేన్, ఉసేన్‌సాహెబ్, సజ్జాద్ ఉసేన్, అబ్బాస్, బాషా ఆధ్వర్యంలో మొహర్రం వేడుకలు జరుపుతున్నారు. ఈ ఏడాది మొహర్రం వేడుకల్లో భాగంగా చావిడిలో శనివారం పీర్లను కొలువుంచారు. సోమవారం అర్ధరాత్రి షియా మతస్తుల ఆధ్వర్యంలో వెయ్యి దివిటీల వెలుగులో హజరత్ అబ్బాస్ పీరును పట్టణంలోని పురవీధుల మీదుగా ఊరేగింపు నిర్వహించనున్నారు. బనగానపల్లె, హైదరాబాద్, తదితర ప్రాంతాల్లో ఉన్న షియా మతస్తులు మాతం నిర్వహిస్తూ ఊరేగింపులో పాల్గొని ప్రత్యేక ఫతేహాలు సమర్పించి మొక్కులు తీర్చుకోనున్నారు.

భక్తిశ్రద్ధలతో చిన్న సరిగెత్తు

మండలంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం చిన్న సరిగెత్తు వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని చిన్నబార్‌ఇమాం, పెద్దబార్‌ఇమాం, ఆంజనేయస్వామి దేవాలయం, రంగరాజుపేట, బాబానగర్, జెండామాను వీధి, సంతపేట, బసిరెడ్డిబావి వీధుల్లో పదిచోట్ల బీబీఫాతిమా, ఇమాంకాశీం, అజరత్ అలీ అక్బర్, చిన్నబార్‌ఇమాం, ఇమాం కాశీం, పెద్దబార్‌ఇమాం, హజరత్ అబ్బాస్, హజరత్ అలీ అబ్బాస్, దస్తగిరిస్వామి, మస్తాన్‌వలి, ఉద్దండ ఇమాంకాశీం పీర్ల దేవుళ్లను కొలువుంచారు. చిన్న సరిగెత్తును పురస్కరించుకుని మెయిన్ బజార్‌లో పీర్ల ఊరేగింపు చేశారు. భక్తులు పీర్ల దేవుళ్లకు ప్రత్యేక ఫతేహాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సోమవారం మధ్య సరిగెత్తును నిర్వహించనున్నారు.

బనగానపల్లెరూరల్: మొహర్రం వేడుకల్లో భాగంగా బనగానపల్లెలో ఆదివారం చిన్నసరిగెత్తు వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పట్టణంలోని ఆస్థానంలో వెలసిన హజరత్ అబ్బాస్, దొరకోట, బొమ్మల పీర్లు, ఇమాం ఖాసీం పీర్లను హిందూ ముస్లింలు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. చిన్న సరిగెత్తు ఉత్సవాల్లో భాగంగా పోలీసు సర్కిల్ కార్యాలయం ఎదుట ఉన్న ఇమాం ఖాసీం పీర్ల చావిడి ఎదుట అగ్ని గుండం ఏర్పాటు చేశారు. ఆదివారం రాత్రి అవుకు మండలం అన్నవరం గ్రామం నుంచి ఇమాంఖాసీం పీర్లతో వచ్చిన భక్తులు అగ్ని గుండ ప్రవేశం చేశారు. బనగానపల్లె సీఐ గంటా సుబ్బారావు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

అవుకులో వేడుకగా చిన్నసరిగెత్తు



పీర్ల దేవుళ్లకు ఫతేహాలు సమర్పిస్తున్న భక్తులు

అవుకు: మండల పరిధిలోని గ్రామాల్లో చిన్న సరిగెత్తు వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. మొహర్రం వేడుకల్లో భాగంగా భక్తులు పీర్ల దేవుళ్లకు ప్రత్యేకంగా తయారు చేసిన పూల సూస్కేలు, దట్టీలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.



పీర్ల చావిడి వద్ద ఏర్పాటు చేసిన అగ్నిగుండం

మొహర్రం వేడుకలు



తారకరామనగర్‌లో పెద్దయ్య స్వామి

డోన్: నియోజకవర్గ వ్యాప్తంగా మొహర్రం వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. డోన్, ప్యాపిలి, బేతంచెర్ల మండలాల పరిధిలో కులమతాలకు అతీతంగా భక్తిశ్రద్ధలతో జరుపుకుంటున్నారు. పీర్లచావిళ్లలో దస్తగిరి, మౌలాలిస్వామి, భారిమామ్, పెద్దయ్య పీర్లస్వాములను కొలువుదీర్చారు. భక్తులు ఫాతెహాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పలు పీర్లచావిళ్ల వద్ద అగ్ని గుండ ప్రవేశం చేసి భక్తిభావాన్ని చాటుతున్నారు.

ప్యాపిలి: మండల కేంద్రంలో ఆదివారం భక్తిశ్రద్ధలతో చిన్నసరిగెత్తు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని అన్ని పీర్ల చావిళ్లను విద్యుత్ దీపాలు, పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు మేళతాళాలతో పీర్ల స్వాములను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మొహర్రం వేడుకల్లో భాగంగా పీర్ల చావిళ్ల వద్ద భక్తుల కోలాహలం నెలకొంది. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన స్థానికులు పీర్ల స్వాములకు మొక్కులు చెల్లించుకునేందుకు వస్తున్నారు.

బేతంచెర్లలో..

బేతంచెర్ల: మతసామరస్యానికి ప్రతీకగా జరుపునే పీర్ల పండుగను బేతంచెర్లతో పాటు ఎం.పేండేకల్లు, ముద్దవరం, ఆర్.బుక్కాపురం, ఆర్ఎస్. రంగాపురం, రహిమానుపురం, సిమెంట్ నగర్, యంబాయి గ్రామాల్లో ఘనంగా జరుపుకున్నారు. ఆదివారం చిన్న సరిగెత్తు సందర్భంగా ఆయా చావిడీల్లో ఫతేహాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.



డోన్ కొత్తపేటలో కొలువైన దస్తగిరి స్వామి



బేతంచెర్ల: పీర్లకు పూజలు చేస్తున్న భక్తులు

వేదగాయత్రీ బ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గం



కళారత్న గండ్లూరి దత్తాత్రేయ దంపతులను సత్కరిస్తున్న బ్రాహ్మణ సంఘం సభ్యులు

డోన్: బ్రాహ్మణ సంక్షేమానికి కృషి చేసేందుకు నూతనంగా వేదగాయత్రీ బ్రాహ్మణ సంఘం ఏర్పాటు చేసినట్లు సంఘం న్యాయ సలహాదారులు హరి మురళీధర్‌రావ్, శేషశయనరావు, కానాల మహేష్ తెలిపారు. స్థానిక గాయత్రీ పీఠంలో ఆదివారం జరిగిన బ్రాహ్మణ సంఘం సభ్యుల సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం గౌరవ అధ్యక్షుడిగా శతావధాని, కళారత్న గండ్లూరి దత్తాత్రేయ శర్మ, అధ్యక్షుడిగా నంద్యాల శంకరశర్మ, కోశాధికారి ఏవీ రావు, కన్వీనర్ కళ్లె గంగాధర శాస్త్రి, కార్యదర్శి శ్రీనివాసశర్మలను ఎన్నుకున్నట్లు వెల్లడించారు. గతంలో బ్రాహ్మణ సంఘం పేరుతో అనేక అక్రమాలకు పాల్పడిన కస్తూరి మూర్తిని సంఘం నుంచి బహిష్కరించినట్లు బ్రాహ్మణ సంఘం తీర్మానించిందన్నారు. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన బ్రాహ్మణులు నూతన గౌరవాధ్యక్షుడు గండ్లూరి దత్తాత్రేయ దంపతులన ఘనంగా సత్కరించారు.

ఆలయ పరిసరాల్లో పరిశుభ్రత



స్వామివారి పూజా సామగ్రిని శుభ్రపరుస్తున్న యోగాసన సభ్యులు



పిచ్చి మొక్కలను తొలగిస్తూ..

డోన్: ప్రపంచంలో మనదేశ సంస్కృతి, సంప్రదాయాలకు ఎంతో విలువనిస్తున్నారని గీతాయోగాసన సంఘం అధ్యక్షుడు రాంపుల్లయ్య అన్నారు. స్థానిక వేంకటేశ్వర ఆలయంలో యోగాసన సంఘం ఆధ్వర్యంలో మన గుడి, మన బడి, మన బాధ్యత అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ధర్మకర్త పాతాళం సుబ్బారావు, ప్రధాన అర్చకుడు శ్రీకాంత్ శర్మల సహకారంతో ఆలయ పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రత పనులు చేశారు. పిచ్చి మొక్కలు తెలగించి గర్భగుడిని శుభ్రం చేశారు. ప్రతి ఆదివారం గీతా యోగాసన సభ్యులు సామాజిక బాధ్యతగా ఏదైనా గుడి లేదా బడిని పరిశుభ్రంగా ఉంచే కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు పుల్లయ్య తెలిపారు. సంఘం సభ్యులు సంగాల సాయిబాబా, నాగభూషణంరెడ్డి, బాలు, శ్రీరాములు, రంగస్వామి, శైలజ, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

డోన్ టౌన్: పగిద్యాల మండలం ముచ్చుమర్రిలో చిన్నారిపై హత్యాచారం చేసిన వారిని బహిరంగంగా ఉరి తీయాలని సీపీఎం మండల, పట్టణ కార్యదర్శులు కొయిలకొండ నాగరాజు, నక్కి శ్రీకాంత్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. బాలికను హత్య చేసి వారం అవుతున్నా ఇంత వరకు మృతదేహాన్ని గుర్తించకపోవడం దారుణమన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. నాయకులు చిన్న రహిమాన్, అక్బర్ బాషా ఉన్నారు.

వృథాగా ప్రభుత్వ భవనం



ఎంపీడీఓ కార్యాలయం సమీపంలో ఉన్న భవనం

కొలిమిగుండ్ల: మండల పరిషత్ కార్యాలయం సమీపంలో లక్షలు వెచ్చించి నిర్మించిన ప్రభుత్వ భవనం వృథాగా మారింది. 25 ఏళ్ల క్రితం భూమా నాగిరెడ్డి ఎంపీగా ఉన్న సమయంలో గెస్ట్ హౌస్ ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో భవనాన్ని నిర్మించారు. విశాలమైన హాల్, ప్రత్యేక గదులు ఏర్పాటు చేశారు. తర్వాత నిధుల సమస్యతో గెస్ట్‌హౌస్ ప్రారంభానికి నోచుకోకుండా పోయింది. అప్పటి నుంచి భవనం వృథాగా ఉండిపోయింది. రెవెన్యూ, వ్యవసాయ అధికారులు వారి అవసరాల నిమిత్తం కొన్ని నెలల పాటు ఉప యోగించుకున్నారు. మండలానికి కస్తూర్బా పాఠశాల మంజూరు కావడంతో తాత్కాలికంగా ఈ భవనంలోనే రెండేళ్ల పాటు నిర్వహిస్తూ వచ్చారు. తర్వాత 2019లో సచివాలయ వ్యవస్థ రావడంతో మూడున్నరేళ్ల పాటు ఇందులో కొలిమిగుండ్లకు చెందిన రెండు సచివాలయాలు ఏర్పాటు చేశారు. కొత్త సచివాలయ భవనాలు నిర్మాణం కావడంతో ఖాళీ చేశారు. ప్రస్తుతం భవనం ఖాళీగా ఉంటోంది. గెస్ట్‌హౌస్ కోసం ఏర్పాటు చేసిన భవనాన్ని ఆధునీకరిస్తే బాగుంటుందని పలువురు అధికారులు భావిస్తున్నారు. మూడు జిల్లాలకు చివర్లో మండలం ఉండడంతో రాజకీయ నాయకులు, వివిధ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు వస్తుంటారు. స్థానికంగా గెస్ట్‌హౌస్ లేక పోవడంతో తుమ్మలపెంట సమీపంలోని అల్ట్రాటెక్ సిమెంట్, కల్వటాల వద్దనున్న రామ్‌కో సిమెంట్ కంపెనీలకు చెందిన గెస్ట్‌హౌస్‌లకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

వ్యవసాయానికి 9 గంటల విద్యుత్

కోవెలకుంట్ల: మండలంలోని ఆయా ఫీడర్ల పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటి వేళ తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ రామమోహన్ తెలిపారు. కోవెలకుంట్ల, కలుగొట్ల, గుళ్లదూర్తి విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని జోళదరాశి, భీమునిపాడు, అమడాల, గుంజలపాడు, రేవనూరు, కలుగొట్ల, కోవెలకుంట్ల, పొట్టిపాడు, హరివరం, కొత్తపల్లె, అల్లూరు ఫీడర్లకు సంబంధించి ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని పేర్కొన్నారు.

సంజామల: మండలంలో సోమవారం నుంచి వ్యవసాయానికి పగటి పూట తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేయనున్నట్లు ఏఈ దుర్గ శ్రీనివాస్ తెలిపారు. సంజామల, ఆకుమల్ల, నొస్సం, పేరుసోముల విద్యుత్ సబ్‌స్టేషన్‌ల పరిధిలోని ముక్కమల్ల, వసంతాపురం, కమలపురి, ఆల్వకొండ, గిద్దలూరు, ఆర్.లింగందిన్నె, అక్కంపల్లె, రామిరెడ్డిపల్లె, ముక్కమల్ల, కానాల, ముదిగేడు, రెడ్డిపల్లె, మిక్కినేనిపల్లె ఫీడర్ల పరిధిలో ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని ఏఈ వెల్లడించారు.

మొరాయించిన ఆర్టీసీ బస్సు



ఆకుమల్లలో ఆగిపోయిన బస్సు

సంజామల: మండల పరిధిలోని ఆకుమల్ల గ్రామంలో ఓ ఆర్టీసీ బస్సు ఆగిపోయింది. ఆదివారం ఉదయం కోవెలకుంట్ల నుంచి అవుకు వెళ్లే ఆర్టీసీ బస్సు ఆకుమల్ల వద్దకు రాగానే గేర్లు పడడం లేదని బస్సు ముందుకు సాగలేదు. సుమారు మూడు గంటల వరకు ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. చివరకు మరో బస్సులో పంపించారు. మూడు గంటల తర్వాత మెకానిక్ వచ్చి రిపేర్ చేసి డిపోకు తరలించారు.

వర్షం దోబూచులాట

కొలిమిగుండ్ల: రోజు ఆకాశంలో కారు మబ్బులు కమ్ముకుంటున్నా చివరకు తేలిక పాటి వర్షం కురుస్తోంది. ఆదివారం తెల్లవారుజామున 6.2 మి.మీ వర్షపాతం నమోదైంది. ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేసేందుకు రైతులు పొలాలను సిద్ధంగా ఉంచుకున్నారు. ఇప్పటి వరకు భారీ వర్షం కురవకపోవడంతో ఆశగా ఎదురు చూస్తున్నారు. ఎండ తీవ్రత, గాలులు వీస్తుండడంతో ఉన్న అదును ఆరిపోయే ప్రమాదముందని రైతులు ఆందోళన చెందుతున్నారు. జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటి వరకు విడతల వారీగా 214.4 మి.మీ వర్షపాతం నమోదైంది. సాధారణ, మోస్తరు మించి వర్షపాతం కురవలేదు. భారీ వర్షం కోసం రైతులు ఎదురు చూస్తున్నారు.

మహానందిలో సందడి



మహానంది: మహానంది ఆలయం ఆదివారం భక్తులతో కళకళలాడింది. సెలవు రోజు కావడంతో వేలాది సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలి వచ్చారు. స్థానిక రుద్రగుండం, బ్రహ్మగుండం, విష్ణుగుండం కోనేర్లలో పుణ్యస్నానాలు ఆచరించి కామేశ్వరిదేవి సహిత మహానందీశ్వర స్వామి వార్లను దర్శించుకొని అభిషేకం, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తుల రద్దీ కొనసాగింది.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన పూర్వ విద్యార్థులు



మొక్కలు నాటుతున్న పూర్వ విద్యార్థులు

డోన్ టౌన్: స్థానిక జీవీఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2000–2003 విద్యా సంవత్సరంలో బీకాం చదివిన 40 మంది విద్యార్థులు ఆదివారం కళాశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 23 ఏళ్లతర్వాత కలుసుకోవడంతో ఒకరికొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. నాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుని సరదాగా గడిపాడు. వీరిలో డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న గిరికుమార్ ఉన్నారు. ఆత్మీయ సమ్మేళనం గుర్తుగా కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. కళాశాలలో నాటిన 40 మొక్కలకు కంచెతో పాటు డ్రిప్ సౌకర్యాన్ని రమణయ్య అనే పూర్వ విద్యార్థి సొంత నిధులతో చేయించారు. కళాశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థుల సహకారం అభినందనీయమని కళాశాల ప్రిన్సిపాల్ భారతి అన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కామేశ్వరరెడ్డి, విజ్జి రెడ్డి, రామలక్ష్మణ్, ఆర్సీ వెంకటేశ్వర్లు, నాగేశ్వరనాయుడు, రాజేశ్వరరెడ్డి, దివాకర్‌రెడ్డి, రాజేశ్వరి, శారద, సుజాత తదితరులు పాల్గొన్నారు.

16న నంద్యాలలో ఏపీటీఎఫ్ నిరసన



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాధవస్వామి

బనగానపల్లె రూరల్: జీపీఎస్ గెజిట్ నోటిఫికేషన్‌ను వ్యతిరేకిస్తూ ఈ నెల 16న జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాధవస్వామి పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ఏపీటీఎఫ్ కార్యాలయంలో ఆ సంఘం నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీపీఎస్ విధానం వల్ల ఉద్యోగులు నష్టపోతారని తెలిపారు. జీపీఎస్, సీపీఎస్ విధానాలను రద్దు చేసే వరకు ఏపీటీఎఫ్ పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. జిల్లా స్థాయిలో నిర్వహించే నిరసన కార్యక్రమంలో ఉద్యోగ ఉపాధ్యాయులంతా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మధుసూదన్‌రావు, మండల అధ్యక్షుడు వెంకటకృష్ణుడు తదితరులు పాల్గొన్నారు.





వాలిపోయి నేలకొరిగేందుకు సిద్ధంగా ఉన్న విద్యుత్ స్తంభాలు

నిలువెత్తు నిర్లక్ష్యం

కోవెలకుంట్ల–గుంజలపాడు ఆర్‌అండ్‌బీ రహదారిలో విద్యుత్ స్తంభాలతో ప్రమాదం పొంచి ఉంది. ఇటీవల కురిసిన వర్షాలకు రహదారి పక్కన ఉన్న విద్యుత్ స్తంభాలు వాలిపోయి నేలకొరిగేందుకు సిద్ధంగా ఉన్నాయి. ఈ రహదారిలో సాయిబాబా గుడి ఉండడంతో నిత్యం కాలినడకన భక్తులు వెళ్తుంటారు. మూడు చోట్ల స్తంభాలు పూర్తిగా ఒరిగి విద్యుత్ తీగలు కిందకు వేలాడుతున్నాయి. సంబంధిత విద్యుత్‌శాఖ అధికారులు చర్యలు తీసుకుని వాలిన స్తంభాలను సరి చేయకపోతే విద్యుత్ ప్రమాదం చోటు చేసుకునే అస్కారం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు.

–కోవెలకుంట్ల